క్లుప్తంగా

చదువుతో పాటు క్రీడలూ అవసరమే...



గుంటూరు రూరల్: క్రీడలో నైపుణ్యాల్ని అంది పుచ్చుకునేందుకు విద్యార్థులు కృషి చేయాలని ఆర్వీఆర్జేసీ కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్ తెలిపారు. చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాలలో శుక్రవారం జరిగిన క్రీడోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని తెలిపారు. చిప్స్ కళాశాల ప్రిన్సిపాల్ విద్యాధర్ మాట్లాడుతూ నాలుగు రోజులపాటు జరిగిన ఈ స్పోర్ట్స్ ఫెస్ట్‌లో రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన 15 కళాశాలల జట్లు పాల్గొన్నాయని చెప్పారు. పోటీల్లో చిప్స్ కళాశాల ప్రథమ, ఏ.ఎం. రెడ్డి కళాశాల ద్వితీయ స్థానంలో నిలిచాయని తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు నాడు- నేడుతో మహర్దశ



పొన్నూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నాడు- నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ వచ్చిందని ప్రముఖ అంతర్జాతీయ క్రికెటర్ అంబటి రాయుడు పేర్కొన్నారు. మండలంలోని దొప్పలపూడిలో ఫేజ్-1 లో అభివృద్ధి చేసిన ఎంపీపీ, జెడ్పీ ఉన్నత పాఠశాలతో పాటు వెల్లలూరులోని మండల పరిషత్ పాఠశాలల్ని శుక్రవారం ఏపీఈడబ్ల్యూడీసీ చైర్మన్ యానుమల నాగార్జున, క్రికెటర్ అంబటి రాయుడు సందర్శించారు. నూతనంగా నిర్మించిన తరగతి గదులు,స్మార్ట్ టీవీలు, తాగునీటి వసతిని పరిశీలించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో మాట్లాడి విద్యాభివృద్ధిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్టేట్ క్వాలిటీ కంట్రోలర్ డీఈ శ్రీనివాసరెడ్డి, ఈఈ అనిల్, డీఈ రవీంద్ర, మండల విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలి: ఏపీటీఎఫ్

గుంటూరు ఎడ్యుకేషన్: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిల్ని చెల్లించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె. బసవ లింగారావు ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కోర్టు ఎదుట ఉన్న సంఘ జిల్లా కార్యాలయంలో శుక్రవారం గుంటూరు జోన్ కన్వీనర్ పి. నాగశివన్నారాయణ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో బసవ లింగారావు మాట్లాడారు. ఉపాధ్యాయులకు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిల్ని చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సరెండ్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బిల్లులు రెండేళ్ల క్రితమే పాస్ అయినప్పటికీ చెల్లింపులకు నోచుకోలేదని తెలిపారు. ఏపీజీఎల్ఐ, పీఎఫ్ రుణ చెల్లింపులు ఆర్నెల్లుగా నిలిచిపోవంతో దాచుకున్న సొమ్ము ఉపయోగపడటం లేదన్నారు. 11వ పీఆర్సీ బకాయిల చెల్లింపులు ఎప్పుడు జరుపుతారో తెలియని పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. 12వ పీఆర్సీని గత జూలై నుంచి మధ్యంతర భృతి ప్రకటించి అమలు చేయాలని, కేవలం కమిషన్ నియమించడం వల్ల ప్రయోజనం లేదని పేర్కొన్నారు. పాఠశాల నిర్వహణ నిధులు విడుదల చేయకపోవడంతో విద్యుత్ బిల్లులు తడిపి మోపెడవుతున్నాయని, కనెక్షన్లు తొలగిస్తామని విద్యుత్ శాఖాధికారులు హెచ్చరిస్తున్నారని తెలిపారు. సమావేశంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాలీద్, జిల్లా కార్యదర్శులు పి.శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి, జి.దాసు, జోసెఫ్ కిరణ్, మాణిక్యాలరావు, జిల్లా కౌన్సిలర్లు పి.లక్ష్మీనారాయణ, పార్వతి, కుటుంబరావు, గౌస్, కోటేశ్వరరావు, వేణు, శివశంకర నాయక్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సాబ్జీ మృతి బాధాకరం



గుంటూరు ఎడ్యుకేషన్: రోడ్డు ప్రమాదంలో శుక్రవారం మరణించిన ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ పీడీఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీకి యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నివాళులర్పించారు. మున్సిపల్ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి శుక్రవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అదే సమయంలో ఎమ్మెల్సీ సాబ్జీ మరణ వార్త తెలియడంతో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. ఆదిలక్ష్మి, ఎం. కళాధర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆకస్మిక మరణం ఉపాధ్యాయ ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏ.ఎన్. కుసుమకుమారి, జిల్లా గౌరవాధ్యక్షుడు పి.వి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

పొన్నూరు అభివృద్ధి నిరోధకుడు ధూళిపాళ్ల

- 25 ఏళ్ల టీడీపీ పాలనలో నియోజకవర్గ అభివృద్ధి శూన్యం
- ఉనికిని చాటుకునేందుకు టీడీపీ నేతల పాట్లు
- రోడ్డు విస్తరణతో ప్రజల దశాబ్దాల కలను నెరవేర్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోశయ్య

పొన్నూరు: పొన్నూరు అభివృద్ధి నిరోధకుడు ధూళిపాళ్ల నరేంద్ర అని, ఆయన హయాంలో అభివృద్ధి చేయలేక, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరుగుతుంటే ఓర్వలేక పోతున్నాడని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య విమర్శించారు. పట్టణంలో జరుగుతున్న రోడ్డు అభివృద్ధి పనుల్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. గత టీడీపీ పాలనలో ఎన్నోసార్లు ప్రజలు కోరినా రోడ్డు విస్తరణ చేయని నరేంద్రను ప్రజలు చీదరించుకుంటున్నారని మండిపడ్డారు. తన ఉనికిని చాటుకునేందుకు ప్రజల్ని రెచ్చగొట్టే విధంగా చేస్తున్న ప్రయత్నాల్ని పట్టణ ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజల దశాబ్దాల కలను సాకారంచేసి రోడ్డు విస్తరణ చేస్తే హర్షించారన్నారు. రోడ్డు విస్తరణ సమయంలో ప్రజలకు హామీ ఇచ్చిన విధంగా నష్టపరిహారం అందించి, భవన యజమానులకు జాప్యం లేకుండా టీడీఆర్ బాండ్లు అందించామని తెలిపారు. ఆర్ అండ్ బీ, మున్సిపల్ శాఖల అనుమతులతో చెప్పిన సమయానికి అభివృద్ధి పనులు ప్రారంభిస్తే అడ్డుకోవడానికి నువ్వెవరూ ? అని ఎమ్మెల్యే రోశయ్య ప్రశ్నించారు.పనుల్ని ఆపాలని అధికారుల్ని బెదిరిస్తే సహించేది లేదన్నారు. దుష్ప్రచారాలతో రెచ్చగొట్టేందుకు ప్రయత్నించినా ప్రజలు ఆయన్ను నమ్మేస్థితిలో లేరని స్పష్టం చేశారు. పట్టణంలోని బీసీ, ఎస్టీ, ఎస్సీ కాలనీల్లో రోడ్లు, కనీసం మంచినీటి వసతి కూడా టీడీపీ హయాంలో కల్పించలేక పోయారని పేర్కొన్నారు. 25 ఏళ్ల పాలనలో చేబ్రోలులోని 160 ఏళ్ల చరిత్ర కలిగిన మద్రాస్ బ్రిడ్జి కూడా కట్టలేకపోయాడని, కొన్ని గ్రామాలకు మంచినీటి సౌకర్యం కూడా కల్పించలేని ఆయనకు మాట్లాడే హక్కుందా ? అని ప్రశ్నించారు. ఏం మొఖం పెట్టుకుని ప్రజల్లోకి వస్తున్నావని ఎద్దేవా చేశారు.లాభం ఉన్న సంగం డైరీని మాత్రమే అభివృద్ధి చేసుకున్నావన్న విషయం ప్రజలకు తెలుసని అన్నారు. త్వరలోనే రోడ్డు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చుకుంటామని తెలిపారు. భవన యజమానులు 85 మందిలో 34 మంది మాత్రమే లీగల్ ప్రూఫ్‌లు చూపించారని, మిగతా వారు పూర్వీకుల నుంచి వచ్చిన ఆస్తుల వివరాలను చూపించడంలో జాప్యం జరిగినట్లు చెప్పారు. అందరికీ న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వంలో పొన్నూరు నియోజకవర్గం అభివృద్ధి వైపు పయనిస్తుందన్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర మైనారిటీ కమిషన్ సభ్యులు షేక్ సైపుల్లా, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భవనం వంశీరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు ఎం.ఏ. మహమ్మద్, నాయకులు బి. రంగారావు, దాసరి నారాయణరావు, కె. శ్రీనివాసరావు, షేక్ మాము పాల్గొన్నారు.

కాకాని శివాలయంలో శాస్త్రోక్తంగా యాగాలు ప్రారంభం



యాగాల ప్రారంభోత్సవంలో ఆలయ ఏసీ, చైర్మన్ తదితరులు

పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి సన్నిధిలో శ్రీ కోటి లలితానామ జప యజ్ఞ పూర్వక ఏకాథ కుండాత్మక సప్తమ సహస్ర చండీ, మహా రుద్ర , నవగ్రహ, లక్ష్మీ, గణపతి మహా యాగాలు బుధవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఏర్పాట్లను ఆలయ సహాయ కమిషనరు నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, పాలకమండలి చైర్మన్ అమ్మిశెట్టి శివ శంకరరావు, పాలకవర్గం సభ్యులు పర్యవేక్షిస్తున్నారు. తెనాలికి చెందిన విష్ణుభట్ల ఆంజనేయచయనులు పర్యవేక్షణలో శుక్రవారం నుంచి ఆరు రోజుల పాటు పూజా క్రతువు నిర్వహించనున్నట్లు ఏసీ తెలియజేశారు. తొలిరోజు శుక్రవారం ఉదయం 8 గంటలకు గురువందనం, గోపూజ, యాగ సంకల్పం, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహావాచనం, లక్ష్మీగణపతి హోమం, చండీపారాయణములు, అఖండ దీపారాధన, జపాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం మంటపారాధనలు, కుండ సంస్కారం, అగ్నిప్రతిష్టాపన, మూలసూత్ర హోమం, సహస్ర చండీ సప్తశతి హోమాలు తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. పూజల్లో 50 మందికి పైగా ఋత్వికులు పాల్గొన్నారు.

ప్రతి నెలా 17న సచివాలయాల వద్ద రేషన్

ప్రత్తిపాడు/ పెదకాకాని: ప్రతి నెలా 17న సచివాలయాల వద్ద ఎండీయూ వాహనం ద్వారా కార్డుదారులకు రేషన్ పంపిణీ చేస్తామని ప్రత్తిపాడు తహసీల్దార్ జి. సిద్ధార్థ, పెదకాకాని ఇన్‌చార్జి తహసీల్దార్ పి. నగేష్ తెలిపారు. ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నెలనెలా కార్డుదారులందరికీ ఉచితంగా బియ్యంతో పాటు రాయితీపై పంచదార, కందిపప్పు, గోధుమ పిండిని వారి ఇంటి వద్దనే ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీ చేస్తోందన్నారు. అనివార్య కారణాల వల్ల సరుకుల్ని ఇంటి వద్ద తీసుకోలేకపోయిన వారికి ప్రతి నెలా 17న సంబంధిత సచివాలయాల వద్ద మధ్యాహ్నం నుంచి వాహనాన్ని ఉంచి పంపిణీ చేయనున్నట్లు సిద్ధార్థ చెప్పారు. డిసెంబర్‌లో ఇళ్ల వద్ద సరుకులు తీసుకోని వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. పంపిణీలో ఎలాంటి సమస్యలున్నా 1967 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

చలపతి ఫార్మసీ అధ్యాపకునికి డాక్టరేట్



నాగరాజు

గుంటూరు రూరల్: విద్యార్థులు, అధ్యాపకుల ఉన్నతికి తమ కళాశాల ఎల్లప్పుడూ కృషి చేస్తుందని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన అధ్యాపకుని అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ కళాశాలకు చెందిన అధ్యాపకుడు గొల్లపల్లి నాగరాజుకు పసిఫిక్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు చెప్పారు. ఆయన అనలైటికల్ మెథడ్ డెవలప్‌మెంట్ అండ్ వాలిడేషన్ ఆఫ్ సమ్ యాంటివైరల్ ఫార్మాస్యూటికల్ ఫార్ములేషన్స్ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందని తెలిపారు. డాక్టరేట్ పొందిన అధ్యాపకుడు నాగరాజును చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి. ఆంజనేయులు అభినందించారు.

వైభవోపేతంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



స్వామి కల్యాణంలో పాల్గొన్న తులసి ధర్మచరణ్, యర్రంశెట్టి వేణుగోపాల్

గుంటూరు రూరల్: గోరంట్లలోని పద్మావతి ఆండాళ్ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో దశావతార కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మ చరణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గోరంట్ల మాజీ సర్పంచ్ యర్రంశెట్టి వేణుగోపాల్‌తో కలసి ధర్మ చరణ్ సుదర్శన హోమంలో పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కల్యాణాన్ని ప్రారంభించారు. వేద పండితుల ఆశీర్వచనం తీసుకుని, భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కంచర్ల ఆంజనేయులు, గజవల్ల వెంకట అప్పారావు, ఆతుకూరి వెంకటేశ్వర్లు, కంచర్ల శంకరరావు, జవ్వాజి వెంకట సుబ్బారావు, గజవల్లి శివన్నారాయణ, గుండా వెంకట జగన్‌మోహన్‌రావు, పూసల శివయ్య, జల్లేపల్లి ముసలయ్య, పాబోలు పూర్ణచంద్రరావు, ఎర్రంశెట్టి రమేష్, దేవరశెట్టి సురేష్, ఓబులశెట్టి వెంకటనారాయణ, కందూరు వెంకటరెడ్డి, ఆళ్ల శివారెడ్డి, గోరంట్ల గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్‌లో ఆర్వీఆర్జేసీ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన క్రీడాకారులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: క్రీడాకారులకు ఆత్మవిశ్వాసమే విజయానికి సరైన మార్గమని ఆర్వీఆర్జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస్ తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో శుక్రవారం జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సౌత్ జోన్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ పోటీలకు ఏఎన్‌యూ జట్టు తరపున ఆడేందుకు తమ కళాశాల విద్యార్థినులు ఎన్నిక కావడం ఆనందంగా ఉందని తెలిపారు. ఇటీవల బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంటర్ కాలేజియేట్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ పోటీల్లో తమ కళాశాల బాలికల జట్టు ప్రథమ స్థానం సాధించి రోలింగ్ ట్రోఫీని కైవసం చేసుకున్నట్లు చెప్పారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ కె. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో భారత దేశ కీర్తి బావుటా ఎగురవేసే స్థాయికి విద్యార్థులు తయారవ్వాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన తమ కళాశాల విద్యార్థులు ఏ. శ్రీనిధి, డి.ఎ. బ్లేస్సీ ఈ నెల చెన్నైలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ ఇంటర్-యూనివర్సిటీ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ తరపున ఆడేందుకు ఎన్నికైనట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ ఎస్.వి.శ్రీనివాసరావు, పీడీలు పి.గౌరీశంకర్, ఎం. శివరామకృష్ణ పాల్గొన్నారు.

నేడు సినీ దర్శకుడు అనిల్ రావిపూడికి పురస్కారం

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో గల స్వామి వివేకానంద సెమినార్ హాలులో శనివారం సుప్రసిద్ధ చిత్రకారుడు, దర్శకుడు బాపు జయంతి సందర్భంగా 'బాపు-రమణ-బాలు కళాపీఠం' నిర్వహణలో బాపు స్మారక పురస్కారాల ప్రదానోత్సవ సభ నిర్వహించనున్నట్లు వ్యవస్థాపకులు డాక్టర్ రమణ యశస్వి ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే సభలో సినీ దర్శకులు అనిల్ రావిపూడికి బాపు స్మారక దర్శక కేసరి పురస్కారం, ప్రసిద్ధ చిత్రకారులు చిదంబరం, రామశాస్త్రి, కార్టూనిస్టు బొమ్మనకు బాపు స్మారక పురస్కారాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కవులు, రచయితలు, కార్టూనిస్టులు, చిత్రకారులు, సాహిత్యాభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

భార్యాభర్తల వివాదంపై కేసులు నమోదు

ప్రత్తిపాడు : భార్యాభర్తల మధ్య తలెత్తిన వివాదం కొట్లాటకు దారితీయడంతో ఇరువురు ఇచ్చిన ఫిర్యాదులపై వేర్వేరుగా కేసులు నమోదు చేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడుకు చెందిన యలమంచిలి శ్రీనుకు అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వరమ్మతో 36 సంవత్సరాల కిందట వివాహమైంది. వీరికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో కొన్ని సంవత్సరాలుగా విడిపోయి వేర్వేరుగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో శ్రీను మరొక మహిళతో సహజీవనం చేస్తున్నాడు. ఈనెల 14న శ్రీను సహజీవనం చేస్తున్న మహిళతో తన ఇంట్లో ఉన్నాడు. విషయం తెలుసుకున్న భార్య వెంకటేశ్వరమ్మ బంధువులు ఇదేమని శ్రీనును ప్రశ్నించారు. మాటామాటా పెరిగి ఇరువర్గాలు కర్రలు, రాళ్లతో కొట్టుకున్నారు. ఈ మేరకు భార్యాభర్తలు ప్రత్తిపాడు పోలీస్ స్టేషనులో వేర్వేరుగా ఇచ్చిన ఫిర్యాదుల మేరకు శుక్రవారం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తైక్వాండోలో ప్రతిభ చూపిన విజ్ఞాన్ స్కూల్ విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: అంతర్ పాఠశాలల తైక్వాండో చాంపియన్‌షిప్‌లో విజ్ఞాన్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ సీహెచ్. శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల నుంచి పోటీల్లో పాల్గొన్న 45 మంది విద్యార్థుల్లో పలువురు బంగారు, రజత, కాంస్య పతకాల్ని పొందినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల్ని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, జోనల్ ఇన్‌చార్జి అనురాధ అభినందించారు.

చలపతి ఇంజినీరింగ్ కళాశాలకు అవార్డు



అవార్డును అందుకున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

గుంటూరు రూరల్: నైపుణ్యతలతో కూడిన విద్యతో ప్రతి విద్యార్థికి ఉజ్వల భవిష్యత్తును కల్పించేందుకు తమ కళాశాల ఎల్లప్పుడూ ముందుంటుందని చల పతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తె లిపారు. నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జాతీయ స్థాయిలో తమ కళాశాలకు డీజీ 100 అనే అవార్డు లభించిందని తెలిపారు. న్యూఢిల్లీకి చెందిన ఇండియా హ్యాబిటెట్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రారంభించిన క్వాలియమ్- 2023 అనే సంస్థ డీజీ 100 సమ్మిట్‌ను నిర్వహించిందని పేర్కొన్నారు. ఇందులో దేశవ్యాప్తంగా పలు కళాశాలలు పాల్గొనగా, ఏపీలో తమ కళాశాల అవార్డుకు ఎంపికవ్వడం సంతోషకరంగా ఉందని తెలిపారు. కళాశాల ఉన్నతికి కృషి చేసిన అధ్యాపకుల్ని చైర్మన్ వై.వి. ఆంజనేయులు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వై.సుజిత్ కుమార్ అభినందించారు.

వైఎస్సార్ సీపీలో పలువురికి పదవులు

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు నగర డాక్టర్స్ విభాగంలో పలువురికి పదవులు కల్పిస్తూ శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ డాక్టర్స్ విభాగం నగర అధ్యక్షుడిగా మణియార్ షాషావలి, ఉపాధ్యక్షులుగా షేక్ యాస్మిన్, షేక్ కరిష్మా, ప్రధాన కార్యదర్శులుగా డి.నవ్య, మొహమ్మద్ షోయల్, షేక్ కరీముల్లా, షేక్ ఆరీఫ్, షేక్ ఉమర్, షేక్ ఉమర్‌ఫారూఖ్‌లను నియమించారు. కార్యదర్శులుగా బిల్లి వెంకటమల్లికార్జున, రణావత్ కృష్ణనాయక్, మూలె ఉపేంద్రరెడ్డి, కన్నెగంటి జ్యోతి, గోడ రమేష్, తగిరి భవ్య, షేక్ రిజ్వానా, గారా భాగ్యరేఖ, పి.నాగేంద్రరావు, దొప్పలపూడి ఆనందరావు, తేలుకుంట్ల వెంకటేశ్వర్లు, సయ్యద్ రెహమాన్‌బాబు, సహాయ కార్యదర్శులుగా కె.విజయకుమార్, డి.మనోహర్‌రావు, ఒడిచర్ల నాగార్జునరెడ్డి, బంటు శ్యామల, ఎం.నాగేశ్వరరావు, సయ్యద్ అబూకర్, పీట్ల గురవయ్య, పీట్ల వికాస్‌కుమార్, షేక్ ముజమ్మిల్‌బాషా, దుడ్ల అనూష, కంచి అనురాధ, కె.వి.కె.కుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం



క్రీస్తు జన్మదిన కేక్ కట్ చేస్తున్న కిరణ్ కుమార్, దయాసాగర్

- వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్ కుమార్
- ప్రత్తిపాడులో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు
- హాజరైన మచిలీపట్నం పోర్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండీ మేకతోటి దయాసాగర్



కీస్తు గేయాలకు చిన్నారుల నత్యాలు

ప్రత్తిపాడు: క్రీస్తు మార్గం ప్రతి ఒక్కరికీ అనుసరణీయమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్ కుమార్ అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం రాత్రి ప్రభుత్వ ఉద్యోగుల ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్ కుమార్, మచిలీపట్నం పోర్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండీ మేకతోటి దయాసాగర్ హాజరయ్యారు. చిన్నారులు క్రీస్తు గేయాలకు నృత్యాలు, కోలాట ప్రదర్శనలు చేస్తూ అలరించారు. క్రిస్మస్ తాత వేషధారణ ఆకట్టుకుంది. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముఖ్య అతిథులు దయాసాగర్, కిరణ్ కుమార్ చేతుల మీదుగా క్రిస్మస్ కేక్ ను కట్ చేశారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ క్రీస్తు బోధనల్ని ఆచరించాలని కోరారు. మేకతోటి దయాసాగర్ మాట్లాడుతూ క్రీస్తు జననంతో లోకానికి వెలుగు వచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో మోహన్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీదేవి, ఎంపీపీ దాసరి అన్నమ్మ, ఎంపీడీవో శ్రీరమ్య, ఈవోపీఆర్డీ మావులూరి మోషె, ఏపీఎం సురేష్ కుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

సుపరిపాలనకు మళ్లీ జగనే రావాలి



మునిపల్లెలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



46వ డివిజన్‌లో పథకాల పట్టికను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

పొన్నూరు: రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని మునిపల్లె గ్రామ సర్పంచి కూచిపూడి స్వరూపరాణి తెలిపారు. గ్రామంలో శుక్రవారం ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. నేతలు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్ని ప్రజలకు వివరించారు. ముందుగా గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సచివాలయంలో గత నాలుగున్నరేళ్లలో గ్రామంలో జరిగిన అభివృద్ధి, వివిధ పథకాల ద్వారా ప్రజలకు అందిన సంక్షేమ ఫలాల వివరాలతో ప్రదర్శించిన బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రుద్రపాటి ఆదిశేషులు, మైనార్టీ, ఎస్సీ ఎస్టీ, సెల్ మండల అధ్యక్షుడు సర్దార్ మనోహర్, నాగ ప్రసాద్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దాసరి శివరామకృష్ణ, రాజ్ కుమార్, గ్రామ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్నన్నే మరలా ముఖ్యమంత్రిగా కావాలి

గుంటూరు రూరల్: జగనన్న అందించిన సంక్షేమ పథకాల ద్వారానే నేడు బడుగు, బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాయని అర్బన్ క్లస్టర్- 2 కన్వీనర్ బండారు శ్రీనివాసరావు తెలిపారు. 46వ డివిజన్ 197వ సచివాలయం పరిధిలో శుక్రవారం డివిజన్ కన్వీనర్ ఆరిక శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఏపీకి జగనే ఎందుకు మరలా ముఖ్యమంత్రిగా కావాలంటే? అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం పరిధిలో ప్రజలకు జగనన్న అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల పట్టికను ఆవిష్కరించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన జెండా ఆవిష్కరణ చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వారు జగనన్న ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. ప్రజలంతా తాము మరలా జగనన్నే ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో కుమ్మర కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, రాచకొండ ముత్యాల నాగరాజు, ప్రసాద్, కస్పారెడ్డి, చిన్న, జల్లేపల్లి వేణుబాబు, రాయప్పరెడ్డి, అంకమ్మరావు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం చిరస్మరణీయం



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రోశయ్య, నేతలు

పొన్నూరు: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాల్ని అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేమని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం అమరజీవి పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రోశయ్య పాల్గొని వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తైక్వాండో చాంపియన్‌షిప్‌లో విద్యార్థులకు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీనివాసరావు, నాగ సౌజన్య

గుంటూరు ఎడ్యుకేషన్: అంతర్ పాఠశాలల తైక్వాండో చాంపియన్‌షిప్‌లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపి పతకాలను కైవసం చేసుకున్నట్లు భారతి స్కూల్ డైరెక్టర్ బాపట్ల శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ నాగ సౌజన్య తెలిపారు. శ్రీనగర్ ఏడో లైనులోని స్కూల్లో శుక్రవారం జరిగిన విద్యార్థుల అభినందన సభలో వారు మాట్లాడారు. కాశీనాథ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 9న జరిగిన తైక్వాండో చాంపియన్‌షిప్‌లో అండర్-8 విభాగంలో ఎం. తనుష్, పి. ఇషా అలోకి రజత, ఎస్. సాజీదా కాంస్య, డి.సాహితి బంగారు పతకాలను సాధించినట్లు తెలిపారు. అండర్-11 విభాగంలో షేక్ హనీఫా, ఐ. లక్ష్మీదుర్గ, షేక్ ఖాజా ఫజిల్ బంగారు, షేక్ ఎండీ మాసీ, షేక్ అనీఫ్, ఎం. సాత్విక్, సీహెచ్. వేదాంత రజత, పి. ఇషాన్ అధర్వ్ కాంస్య పతకాలు పొందారని పేర్కొన్నారు. అండర్-14 విభాగంలో ఎస్. దుర్గేష్ బంగారు, ఐ. మహేష్ బాబు కాంస్య పతకాలతో పాటు అండర్-17 విభాగంలో పి. వెంకటేష్, పి.తనుష్, షేక్ రసూల్, కె.వెంకటేశ్వర్లు బంగారు, పి. శ్రీకాంత్ రజత, ఎం. చైతన్య కాంస్య పతకాన్ని పొందారని తెలిపారు.